క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నులకపేట తహసీల్దార్ కార్యాలయం, పోలకంపాడు, సాయినగర్ కట్ట, ఉండవల్లి సెంటర్, ఈఎస్ఐ హాస్పిటల్ ప్రాంతం, సీతానగరంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

మేడికొండూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి నాగరాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, మండలంలోని సిరిపురం, భీమినేనివారిపాలెం, పొట్లపాడు, జంగంగుంట్లపాలెం, మందపాడు, పాలడుగు, సరిపడూడి, యలవర్తిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఫిరంగిపురం ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి టి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా సబ్‌సెంటర్లో వైద్యశిబిరం నిర్వహించారు. 54మందికి రక్తపరీక్షలు, సాధారణ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సాధారణ పరీక్షలు, బరువు, ఎత్తు చూశారు. చిన్నారుల తల్లులకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గాబులు, ప్లాస్టిక్ టబ్‌ల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం ఆంతోనిరాణి, హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఆశాలు సుజాత, శాంతరాణి, శాంతకుమారి, పద్మ, జోజమ్మలు పాల్గొన్నారు.

జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సభ

తాడేపల్లిరూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ మహాసభ జూలై 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ తెలిపారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని లిడ్‌క్యాప్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 7వ తేదీ కాజా వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ మహాసభను నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వల్లభాపురపు నాగయ్య, కొరిటిపాటి ప్రేమకుమార్, మహాసేన వ్యవస్థాపకులు బట్టు రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు బూదల శ్రీను, నలుకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై ఎస్ఈబీ అధికారుల దాడులు

తాడికొండ: పేకాట స్థావరాలపై గుంటూరు ఎస్ఈబీ అధికారులు దాడిచేసి 12 మందిని అరెస్టు చేసిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో జరిగింది. మండలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఈబీ అధికారులు నిడుముక్కల కొండల ప్రాంతంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 12 మంది పేకాట రాయుళ్లు, రూ.2,23,540 నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని తాడికొండ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

ఇస్త్రీ బండి అందజేత

మంగళగిరి: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో నవులూరుకు చెందిన రాచకొండ రాముకి స్థానిక పార్టీ నేతలు శుక్రవారం ఇస్త్రీ బండిని అందజేశారు. కార్యక్రమంలో దొడ్డక కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని అజయ్‌నగర్‌కు చెందిన గజంరాజు- అమీన అనే వృద్ధ దంపతులకు శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ చేతుల మీదుగా రూ.10వేలు అందజేశారు. కొప్పురావుకాలనీకి చెందిన పాలనం నందకుమార్‌కు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, అనుబంధ సంఘాల నాయకులు ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి శ్రీ మద్భాగవత పారాయణ

పాతగుంటూరు: సంపత్‌నగర్‌లోని శృంగేరి శంకరమఠం శారదా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 25 నుంచి జూలై 2వ తేదీ వరకు 108వ శ్రీమద్భాగవత పారాయణ పూర్వక సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు విష్ణుభట్ల ఆంజనేయులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న ఉదయం 6 గంటలకు గురువందనం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షాబంధనం, రుత్విగ్వరణం, కలశస్థాపనం, అఖండ దీపారాధన, శ్రీ మద్భాగవత మహత్య పారాయణ ప్రారంభం, 26 నుంచి జూలై 2 వరకు ఉదయం 7 గంటలకు పారాయణ ప్రారంభం, మద్భాగవత మహాపురాణ ప్రవచనం, భాగవత పారాయణం, భాగవత ప్రవచనం, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్
- లాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం



లాంలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటున్న కత్తెర సురేష్‌కుమార్

లాం(తాడికొండ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సువర్ణయుగం చూసిన రాష్ట్ర ప్రజలు మరో 50 సంవత్సరాలు ఆయన్నే సీఎంగా చూడాలనుకుంటున్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సమస్యను పాదయాత్ర ద్వారా తెలుసుకొని పార్టీలకతీతంగా సంక్షేమం అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు పేదలకు చేసిన మేలు ఒక్కటైనా లేనందునే నేడు ఆయనను చిత్తుచిత్తుగా ఓడించి 23 సీట్లకే పరిమితం చేసినప్పటికీ తీరు మార్చుకోపోవడం బాధాకరం అన్నారు. బాబు హయాంలో విద్య, వైద్యం, రాజకీయం, వ్యాపారం అంతా పేదవాడికి చోటు లేకుండా కార్పొరేట్‌ల కనుసన్నల్లో నడిచేదని, నేడు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ విధానాలకు స్వస్తి పలికి పేదవాడికి విద్య, వైద్యం, వ్యాపార రంగాలను చేరువకు తీసుకొచ్చి అండగా నిలిచాడన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్య, బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించడంతోపాటు నాణ్యమైన భోజనం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందించి నాడు–నేడు ద్వారా కార్పొరేట్‌కు ధీటుగా ఆధునీకరించిన ఘనత జగనన్నదే అన్నారు. ఆరోగ్యశ్రీకి బాబు హయాంలో బిల్లులు పేరుకుపోయి అనారోగ్యశ్రీగా మారి కొన్ని ఆసుపత్రులకే పరిమితమైందని, కానీ నేడు అందుకు భిన్నంగా పక్క రాష్ట్రాల్లో కూడా కార్పొరేట్ వైద్యం చేయించుకునే పరిస్థితి వచ్చిందంటే జగనన్నకు పేదల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బాబును కుర్చీ ఎక్కించేందుకు రాష్ట్రంలో ప్రతిపక్షాలన్నీ ఏకమై చేస్తున్న తప్పుడు ప్రచారాలు చెల్లవని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో 175/175 సీట్లు సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, ఎంపీటీసీ సభ్యుడు రావూరి దివ్య నరేష్, నిడుముక్కల సర్పంచ్ మాదాసు రత్నకుమారి, యార్డు మాజీ చైర్మన్ కొమ్మినేని రామచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, వివిధ విభాగాల నాయకులు షేక్ నూర్జహాన్, కొండా శ్రీనివాసరెడ్డి, ఇమ్మానుయేలు, మైనార్టీ నాయకులు షేక్ సలీమ్, మీర్జావలి, సాధిక్, గోల్డ్ బాబు, రాయపూడి రంగారావు, కొల్లికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకోసం కలిసికట్టుగా పనిచేయాలి

తాడికొండ: పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు విభేదాలు వీడి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరు మండలంలో పార్టీకి దూరంగా ఉంటున్న పలువురు నాయకులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. పార్టీ అందరిది అని కొందరిది కాదని చిన్నపాటి విభేదాలు ఉంటే కలిసి కూర్చొని చర్చించుకోవాలని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే శక్తివంచన లేకుండా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ పనిచేసి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతే మన ఆరోగ్యం

- ప్రతి ఇంటిలో శానిటేషన్‌పై అవగాహన కల్పించాలి
- అప్పుడే వ్యాధులను నివారించవచ్చు
- డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి



సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి

తాడేపల్లిరూరల్: పట్టణ పరిశుభ్రతే ప్రజల ఆరోగ్యం .. పట్టణంలోని వీధులను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలకు మనందరం అవగాహన కల్పించాలని డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సచివాలయాల అడ్మిన్‌లు, శానిటేషన్ అడ్మిన్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కలసి పలు వార్డులలో ఆయన విస్తృతంగా పరిశీలించారు. అక్కడక్కడ కొన్ని ప్రాంతాల్లోని కాలువల్లో చెత్త పేరుకుపోవడాన్ని గమనించి ఆ ఇంటి యజమానులను పిలిచి ఇలా వేయడం వల్ల నష్టాలను వివరించారు. శివారెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే ఆర్కే, కమిషనర్ శారదాదేవి ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రతి సచివాలయం పరిధిలో శానిటేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా పర్యటిస్తున్నామని దానిలో భాగంగానే తాడేపల్లిలో పర్యటిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చెత్త బయట పడవేయకుండా, పొడి, తడి చెత్త, ఇతర హానికర పదార్థాలను సేకరించేందుకు మూడు డస్ట్‌బిన్‌లను ఇచ్చిందని, ప్రతి రోజూ శానిటేషన్ సిబ్బంది ఇళ్లకు వెళ్లి సేకరిస్తున్నారని, చాలామంది తడి, పొడి చెత్తను ఒకే డస్ట్‌బిన్‌లో వేసి శానిటేషన్ సిబ్బందికి అందజేస్తున్నారన్నారు. అలా కాకుండా ప్రతి ఇంటికి వలంటీర్లు, సచివాలయ శానిటరీ ఇన్‌ఛార్జిలు వెళ్లి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలని అన్నారు. కాలువల్లో తినుబండారాలు పడవేయడం వల్ల వీధుల్లోకి కుక్కలు, పందులు ఇతర జంతువులు వచ్చి ఏ విధంగా ప్రవర్తిస్తాయో, వాటి వల్ల ఎటువంటి రోగాలు వస్తాయో, చిన్నపిల్లలకు ఎటువంటి నష్టం జరుగుతుందనే విషయాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ పరిధిలోని సచివాలయం అడ్మిన్లు, శానిటరీ అడ్మిన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్‌లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు తదితరులు

మంగళగిరి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగర కమిషనర్ యు శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరైనా అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందకుంటే వారికి కావాల్సిన డాక్యుమెంట్లను అందించి లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

మంగళగిరి: పుస్తకాలు, యూనిఫాం పేరుతో నిలువుదోపిడీ చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నేతలు శుక్రవారం ఎంఈఓ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పి మున్నా మాట్లాడుతూ నగరంలో విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారాయన్నారు. అధిక ఫీజులతో బాధపడుతున్న తల్లిదండ్రులకు అదనంగా పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూ అని అదనపు భారం మోపుతున్నారని మండిపడ్డారు. నిబంధనలను అతిక్రమించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓను కలసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలంటూ ధర్నా

మంగళగిరి: ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నగరంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జి మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నా సంబంధిత అధికార యంత్రాంగం చోద్యం చూడటం సిగ్గు చేటన్నారు. నియోజకవర్గ పరిధిలోని నిర్మలా హైస్కూల్, నారాయణ, డాన్‌బాస్కో, చైతన్య టెక్నో స్కూల్స్‌పై నామమాత్రపు చర్యలు తీసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జీఓ నెంబరు 1 ప్రకారం ఫీజులకు సంబంధించిన ధరలను నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని, పాఠ్య పుస్తకాలకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ గోపి, కో కన్వీనర్ అభిషేక్, బి యశ్వంత్ పాల్గొన్నారు.

యర్రబాలెం చెరువుకు మహర్దశ

- రూ.2కోట్ల నిధుల మంజూరు
- కొనసాగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే ఆర్కే ప్రత్యేక చొరవ పట్ల స్థానికుల హర్షం



రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భాగంగా నీటి ప్రవాహాన్ని నిరోధించేందుకు ఏర్పాటుచేసిన ఇసుక బస్తాలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి యర్రబాలెం నల్లచెరువుకు మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ప్రత్యేక చొరవ తీసుకోవడంతో సుమారు రూ.2 కోట్ల నిధులతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టారు. కొన్నేళ్లుగా చెరువు కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. చెరువు పక్కనే ఆనుకుని ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనని వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది జనవరి 17వ తేదీన చెరువులోకి కారు దూసుకుపోయి మంగళగిరికి చెందిన వడ్రంగి కార్మికుడు వాకా శ్రీనివాసరావు, డాక్యుమెంట్ రైటర్ లు తేజ్ రాంజీ, కొల్లూరు సాయి, ఏసీ మెకానిక్ పవన్‌కుమార్ జల సమాధి అయ్యారు. తాజాగా రెండు నెలల కిందట సచివాలయం పోస్ట్‌మన్ ద్విచక్ర వాహనంపై వెళుతూ అదుపుతప్పి చెరువులోకి దూసుకుపోయి నీట మునిగి మృతి చెందాడు. వెలగపూడిలోని సచివాలయానికి వెళ్లాలంటే మంగళగిరి నుంచి యర్రబాలెం చెరువు కట్ట మీదుగా ప్రయాణించాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరిగే సందర్భంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులతో పాటు పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సైతం ఇదే మార్గంలో వెళుతుంటారు. కాలక్రమేణా ఆర్‌అండ్‌బీ రహదారి చెరువు నీటి ఉధృతికి కోతకు గురైంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోతకు గురైన చెరువు సమస్యను ఇటీవల స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన చెరువు కట్ట అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. దీంతో వారు చెరువు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపగా సుమారు రూ.2 కోట్ల నిధు లు కేటాయించింది. రెండు రోజుల నుంచి పనులు చకచకా జరుగుతున్నాయి. వర్షాకాలం వచ్చిన నేపథ్యంలో వీలైనంత త్వరితగతిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నారు. చెరువు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే ఆర్కేకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తగిన జాగ్రత్తలతోనే మలేరియా నివారణ



ఇంటింటికి తిరిగి వివరిస్తున్న సత్తెనపల్లి అర్బన్ మలేరియా అధికారి సీహెచ్ ప్రభాకరరెడ్డి

ఫిరంగిపురం: తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే మలేరియా నివారణ సాధ్యమవుతుందని సత్తెనపల్లి అర్బన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకరరెడ్డి అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌వలి పనుల నిమిత్తం చత్తీస్‌ఘడ్‌లో నివసిస్తూ ఇటీవల స్వగ్రామానికి రాగా అతడికి మలేరియా జ్వరం రావడంతో స్థానిక సబ్‌సెంటర్లో పరీక్షలు చేయించుకొని జ్వరం తగ్గకపోవడంతో జీజీహెచ్‌లో చికిత్స కోసం చేరాడు. విషయం తెలుసుకున్న ఆరోగ్య సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది జ్వరం వచ్చిన వ్యక్తి ఇంటిలోని కుటుంబసభ్యులకు శుక్రవారం మలేరియా పరీక్షలు చేశారు. నిర్ధారణ అయిన ఇంటికి చుట్టు పక్కల నివాసాల్లో 50 మందికి పరీక్షలు చేసి వారికి మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించినట్లు ప్రభాకరరెడ్డి తెలిపారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది బాబురావు, విజయ్‌కుమార్, అరుణ, బాల అనూష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోలో ఐరన్ దిమ్మెలు తరలింపు

- నిందితులు పరారు
- పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్



పోలీసులు సీజ్ చేసిన ఆటో ఇదే

తాడేపల్లిరూరల్: ఐరన్ దిమ్మెలను తరలిస్తున్న ఆటోను తాడేపల్లి పోలీసులు శుక్రవారం సీజ్ చేయగా నిందితులు పరారయ్యారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ ఆటో తాడేపల్లి పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులు ఆటో వద్దకు వెళ్లారు. ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. ఆటో నడుపుతున్న వ్యక్తిని పట్టుకుని పరిశీలించగా పెద్ద పెద్ద ఐరన్ దిమ్మెలు కనిపించాయి. ఆటోను, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తమదైన శైలిలో విచారించగా, రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న ఐరన్ దిమ్మెలు దొంగిలించి విజయవాడలో అమ్మేందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. పట్టుబడ్డ యువకుడు విజయవాడకు చెందిన కిషోర్‌గా గుర్తించామని, పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే వారిద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

22-ఏ నిషేధిత భూముల్లో పూర్తయిన సర్వే

- గ్రామకంఠంను వేరుచేసే ప్రక్రియలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ శాఖలు
- 991 నివాసాలు ఉన్నట్లు గుర్తింపు
- రెగ్యులైజేషన్ చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు



పాత రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ డీసీపీ మహాలక్ష్మి దొర తదితరులు

తాడేపల్లిరూరల్: నిషేధిత జాబితాలోని భూములపై రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు సర్వే చేస్తున్నారు. సర్వే ప్రక్రియ పూర్తికాగా శుక్రవారం రికార్డులను పరిశీలించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 201లో పలువురు నివాసాలు ఏర్పాటు చేసుకుని నివసిస్తున్నారు. 2014లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతాన్ని నిషేధిత 22–ఏ జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి నుంచి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకుల చుట్టూ ప్రజలు తిరుగుతూనే ఉన్నారు. కానీ ప్రయోజనం లేకుండా పోయింది. ఎట్టకేలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చొరవతో గ్రామ కంఠాన్ని నిషేధిత జాబితా నుంచి విడదీసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. శుక్రవారం తాడేపల్లిలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.నాగిరెడ్డి, టౌన్ ప్లానింగ్ డీసీపీ మహాలక్ష్మి దొర ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాత రికార్డుల ప్రకారం వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యాన సర్వే నంబర్ 201లో ఉన్న 159 ఎకరాల భూమిని సర్వే చేశామని, మొత్తం 991 పక్కా నివాసాలు నిర్మించుకుని జీవిస్తున్నారని, పాత రికార్డుల ప్రకారం గ్రామ కంఠం ఎక్కడ దాకా ఉందో పరిశీలించి తుది జాబితా జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని, ఇప్పటి వరకు సర్వే చేసిన భూములన్నీ కూడా గ్రామ కంఠంలోనే ఉన్నాయని, అక్కడక్కడా కొంత భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు గుర్తించామని, త్వరలోనే తాడేపల్లి పట్టణ పరిధిలో 2014 ముందు గ్రామ కంఠంలో ఏ విధంగా అయితే రిజిస్ట్రేషన్లు అయ్యాయో అదేవిధంగా రిజిస్ట్రేషన్లు జరిగే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, సర్వేయర్ శ్రీరంగమోహన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటేశ్వర్లు, సచివాలయ సర్వేయర్లు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల తీరును నిరసిస్తూ ఆందోళన

కిడ్నాప్‌కు యత్నిస్తే సీఐ కేసు నమోదు చేయలేదంటూ ఆగ్రహం



పోలీస్‌స్టేషన్ ఎదుట సీఐని ప్రశ్నిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో దళిత యువకులపై అగ్రవర్ణాలకు చెందిన 40 మంది యువకులు దాడికి పాల్పడిన ఘటనలో సీఐ కేసు నమోదులో పక్షపాతం చూపించాడంటూ శుక్రవారం తాడికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ బాధితులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో పంచాయతీ చెత్త బండి వ్యవహారంలో వచ్చిన వివాదం పరిష్కారం చేసుకుందామని చెప్పి ప్రధాన నిందితుడు కళ్లం మనోహర్‌రెడ్డి అలియాస్ పండు ఇతర నిందితులు పిలిచి దళిత యువకులపై దాడి చేశారన్నారు. దాడిలో సుమారు 40 మంది యువకులు పాల్గొన్నారని, వీరంతా ముందస్తు వ్యూహంతోనే దాడి చేశారన్నారు. కర్లపూడి శామ్యూల్‌రాజ్‌ని హత్య చేసేందుకు తీసుకెళుతుండగా గ్రామస్తులు వెంటపడితే పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి వదిలేసి నిందితులు దర్జాగా వెళ్లారన్నారు. ఇంత జరిగినా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయకుండా దెబ్బలు తగిలిన బాధితులపై కేసు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసే వరకు నిరసన విరమించేది లేదని భీష్మించుకున్నారు. ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో విరమించారు. పోలీసుల వైఖరి కారణంగానే నిందితులు స్వేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారని గ్రామ సర్పంచ్ బెజ్జం మహేష్ ఆరోపించారు. సీఐ పలు కేసుల్లో ఇబ్బందికరంగా వ్యవహరించారని అన్నారు.

నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కంతేరు దాడి ఘటనలో నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడు పొట్టకర్ర వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు కళ్లం మనోహర్‌రెడ్డి అలియాస్ పండుతోపాటు పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, 324, 34, 354, 363, 506 ఐపీసీ సెక్షన్‌లతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విట్ యూనివర్సిటీలో విద్యార్థుల ఘర్షణ



విట్ యూనివర్సిటీలో దాడి చేసుకుంటున్న విద్యార్థులు

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు విట్ కళాశాలలో ఇరువర్గాలకు చెందిన విద్యార్థుల మధ్య వివాదం జరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ వ్యవహారంపై తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఒత్తిడి తీసుకొచ్చిన యాజమాన్యం వెనక్కి రప్పించింది. గతంలో ఇలాంటి వివాదాలు పలుమార్లు జరిగినా యాజమాన్యం తొక్కిపట్టి విద్యార్థులను బెదిరించి బయటకు రానీయకుండా చేస్తుందని, పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివాదానికి సంబంధించిన పలు వీడియోలు సోషల్ మీడియా ద్వారా బయటకు పొక్కడంతో చక్కబెట్టారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో హడావుడిగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన యాజమాన్యం ఇద్దరు విద్యార్థుల మధ్య వచ్చిన వివాదాన్ని ఇగోగా తీసుకొని కొట్టుకున్నారని, ఇది చిన్న విషయమని తెలియని వయసులో చేసిన వివాదం కావడంతో మందలించి వదిలేశామని, ఇద్దరూ సఖ్యత పడి ఒకరికొకరు సంఘీభావం తెలుపుకున్నారన్నారు. సమావేశంలో వర్సిటీ వీసీ ఎస్‌వీ కోటారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రాజీవ్‌గాంధీనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలిక చదువు మానేసి ఇంటి దగ్గర ఉంటోంది. సంజీవయ్యనగర్‌కు చెందిన సాయి అలియాస్ సాగర్ (20) ఆమెతో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. స్నేహంగా మెలుగుతూ గత నెలలో పాడుబడ్డ బిల్డింగ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. కొద్దిరోజులుగా బాలిక అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా, గర్భవతి అని నిర్ధారణ అయింది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.